క్లుప్తంగా

పాలేరులో ప్రధాన పార్టీల అభ్యర్థుల ఆస్తులు..

ఖమ్మంరూరల్: పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి 2023 సంవత్సరం వరకు రూ.434 కోట్లు ఆస్తులు ఉండగా, అప్పులు రూ.43.53కోట్లు ఉన్నాయి. అదే విధంగా బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డికి రూ.80.57 కోట్లు ఆస్తులుండగా, రూ.10.77 కోట్లు అప్పులున్నాయి. సీపీఎం అభ్యర్థి తమ్మినేని వీరభద్రంకు రూ.1.71 కోట్లు ఆస్తులుండగా అప్పులేమీ లేవు.

తోపుడు బండి వితరణ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని శ్రీటౌన్ మహిళా కళాశాల వద్ద ఓ పేద మహిళ అద్దంకి వెంకటలక్ష్మికి వ్యాపార నిమిత్తం లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం ఆధ్వర్యాన శనివారం రూ.10 వేలు విలువైన ఓ తోపుడు బండిని వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు క్రిష్టారెడ్డి, హనుమంతరావు, డాక్టర్ డీపీసీ రావు, దుర్గా నాగేశ్వరరావు, జనార్దన్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిపై ఆరు కేసులు

నేలకొండపల్లి: పాలేరు బీజేపీ అభ్యర్థి నున్నా రవికుమార్ తన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న కేసుల వివరాలను శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. బీజేపీ ఆధ్వర్యాన వివిధ అంశాలపై జరిపిన పోరాటంలో తనపై మొత్తం 12 కేసులు నమోదు కాగా.. వాటిలో 6 కేసులు తొలగించగా.. మిగతా 6 కేసులు ఖమ్మం టూటౌన్, కూసుమంచి పరిధిలో పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు.

మున్నూరు కాపు కార్పొరేషన్ ప్రకటనపై హర్షం

ఖమ్మం మామిళ్లగూడెం: కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన బీసీ డిక్లరేషన్‌లో మున్నూరు కాపుల అభ్యున్నతి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం పట్ల మున్నూరు కాపు సంఘం జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో మున్నూరు కాపులంతా కాంగ్రెస్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కె.సీతారాములు, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర నాయకుడు శెట్టి రంగారావు, కల్లూరు సోమనాథం, దేవేందర్, హన్మంతరావు, నరసింహారావు, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

నేలకొండపల్లి: మండలంలోని కోనాయిగూడెం, కోరట్లగూడెం, రాజేశ్వరపురం తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కూసుమంచి సీఐ జితేందర్ సందర్శించారు. కేంద్రాల వద్ద సౌకర్యాలపై ఆరా తీసి సిబ్బందికి ఎలాంటి ఆటంకాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక దృష్టి సారించామని, ఎవరైనా ఆటంకాలు కలిగిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట నేలకొండపల్లి ఎస్సై బి.సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభకు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

కామేపల్లి/నేలకొండపల్లి: హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన మాదిగల విశ్వరూప మహాసభకు కామేపల్లి, నేలకొండపల్లి మండలాల నుంచి పెద్దఎత్తున ఎమ్మార్పీఎస్ శ్రేణులు తరలివెళ్లారు. కామేపల్లిలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు పాటిబండ్ల ప్రసాద్ మాదిగ ఆధ్వర్యాన నీరుడు ఏడుకొండలు, గురేశ్, మామిడాల మోహన్‌రావు, గుండ్ల వెంకటరత్నం, రవికుమార్ తదితరులు తరలివెళ్లగా.. నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం, కోనాయిగూడెం నుంచి ప్రదర్శన నిర్వహించాక తరలివెళ్లారు. ఈ కార్యక్రమాల్లో మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కో–కన్వీనర్ వంగూరి ఆనందరావు,వడ్లమూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రమేశ్‌కు పురస్కారం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్ఆర్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ అధ్యక్షుడు జర్పుల రమేశ్‌కు స్వచ్ఛంద సంస్థ స్పందన ఇదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ బాధ్యులు శామ్యూల్‌రెడ్డి తదితరులు శనివారంలో కళాశాలలో గురు స్పందన అవార్డును అందించారు. ఈ సందర్భంగా రమేశ్‌ను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

సంతాపం..

ఖమ్మంమయూరిసెంటర్: కొణిజర్ల మండలం కొండవనమాల మాజీ సర్పంచ్ మద్దినేని కృష్ణకు బుధవారం ఇంట్లో గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శనివారం ఈమేరకు మంత్రి అజయ్‌కుమార్, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలు కృష్ణ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. కాగా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించారు.


వాటర్ బేల్స్


లక్ష్మీ ప్రమిద


కలశ దీపం


మట్టి తులసి కోట


స్టెప్పుల ప్రమిద

చిరు దివ్వెల సందడి..!


ప్రమిదలు, ఆకాశ దీపాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

దీపావళి వస్తుందంటేనే మార్కెట్లన్నీ హడావుడిగా ఉంటాయి. నగరంలో ఎక్కడ చూసినా దీపావళి ప్రమిదల విక్రయాలు జరుగుతున్నాయి. దీపావళి మొదలుకొని కార్తీక మాసం పూర్తయ్యే వరకూ ప్రతీ రోజు దీపాలను ప్రమిదలతో వెలిగించడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో పండగకు మూడు, నాలుగు రోజుల ముందు నుంచే జనాలు ప్రమిదలను కొనుగోలు చేసే పనిలో పడ్డారు. వివిధ కళారూపాలతో కళాకారులు తీర్చిదిద్దిన వివిధ రకాల ప్రమిదలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.


వివిధ ఆకృతుల్లో ఆకట్టుకుంటున్న ప్రమిదలు

మొదలైన దీపావళి, కార్తీక మాసం సందడి..

- మునుపెన్నడూ లేని ప్రమిదల రకాలు
- మోడల్‌కు తగ్గట్టుగా ధరలు
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసి విక్రయిస్తున్న వైనం
- విక్రయాలతో రోడ్లన్నీ రద్దీమయం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలో దీపావళి కళ వచ్చేసింది. కళాకారులు స్థానికంగా తయారు చేసిన ప్రమిదలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వివిధ ఆకృతుల్లో ఆకాశ దీపాలను తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. గుజరాత్ నుంచి ప్రత్యేకమైన ప్రమిదలు, కలకత్తా నుంచి ఆకాశ దీపాలు, తమిళనాడు నుంచి చిమ్ని దీపాలు(గాజు), అఖండ దీపాలు తీసుకొచ్చి జిల్లా వ్యాప్తంగా విక్రయిస్తున్నారు.

రాశులుగా పోసి విక్రయాలు..

నగరంలోని ఇల్లెందు క్రాస్‌రోడ్, సర్దార్ పటేల్ స్టేడియం, గట్టయ్యసెంటర్, కొత్త బస్టాండ్, బైపాస్ రోడ్, బస్‌డిపో రోడ్, మయూరి సెంటర్, వైరా రోడ్, కమాన్ బజార్, కస్బా బజార్, గాంధీచౌక్, కాల్వొడ్డు, పొట్టి శ్రీరాములు రోడ్, ముస్తఫానగర్, బోనకల్ రోడ్ తదితర ప్రాంతాల్లో రహదారుల వెంట ప్రమిదల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రమిదలను రోడ్ల వెంట రాశులగా పోసి అమ్ముతుండగా.. మరికొందరు తోపుడు బండ్లపై వీధుల వెంట తిరిగి విక్రయిస్తున్నారు.

డిజైన్‌కు తగ్గట్టుగా ధరలు..

ప్రమిదల సైజు, ఆకారాన్ని బట్టి మార్కెట్‌లో విక్రయాలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది ప్రమిదల విక్రయాలు బాగా పెరిగాయి. వీటితో పాటు బొమ్మల కొలువు బొమ్మలను కూడా విక్రయిస్తున్నారు. డిజైన్ ఉన్న చిన్న ప్రమిదలు డజను రూ.35 నుంచి రూ.65 వరకు, చిమ్ని దీపాలు రూ.80, కలకత్తా దీపాలు రూ. 90, అఖండ దీపాలు రూ.30 మొదలు రూ.200ల వరకు, కలుషం ఆకాశ దీపాలు రూ.200, వాటర్ బెల్స్ రూ.300 నుంచి రూ.600 వరకు, ఏనుగు దీపాలు, తులసి కోటలు తదితరాలను విక్రయిస్తున్నారు. ఓ వైపు దీపావళి పండుగ, ఆ తర్వాత కార్తీక మాసం ఉండడంతో ప్రమిదలకు, దీపాలకు గిరాకీ బాగా పెరిగింది.

భిన్నమైన ఆకాశ దీపాలు..



మునుపెన్నడూ లేని విధంగా భిన్నమైన ప్రమిదలు, ఆకాశ దీపాలు విక్రయిస్తున్నారు. దీపావళి పండుగతో పాటు కార్తీక మాసంలో దీపాలు వెలిగించడం ఆనందంగా ఉంటుంది. ప్రమిదలు, ఆకాశ దీపాలు కొనుగోలు చేశాం. ఆకాశ దీపాలకు ధరలు ఎక్కువగా ఉన్నాయి.

– వంశీప్రియ, ఇల్లెందు క్రాస్ రోడ్

ఇంటి నిండా వెలిగిస్తాం..



దీపావళి పండగ అంటే చాలా ఇష్టం. దీపావళి మొదలు కార్తీక మాసం వరకు దీపాలను వెలిగిస్తాం. అందులో కార్తీక పౌర్ణమి రోజున ఇంటినిండా వెలిగిస్తాం. ఇష్టమైన ప్రమిదలను కొనుగోలు చేస్తున్నాం. మునుపెన్నడూ లేని ప్రమిదల రకాలు మార్కెట్‌లోకి వచ్చాయి.

– నాగజ్యోతి, ముచ్చర్ల, కామేపల్లి మండలం

దీపాల కొనుగోళ్లకు ఆసక్తి..



దీపావళి, కార్తీక మాసం పండుగల సందర్భంగా ప్రమిదలు, ఆకాశ దీపాలు కొనుగోళ్లకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. స్థానికంగా దొరికే వాటితో పాటు వివిధ రాష్ట్రాల్లో తయారు చేసిన ప్రమిదలు, ఆకాశ దీపాలను తీసుకొచ్చి విక్రయిస్తున్నాం. ఈసారి విక్రయాలు బాగానే ఉన్నాయి.

– పుష్ప, కావ్య మట్టి పాత్రల విక్రయదారురాలు

2018కి ముందు నీ స్థానికత ఎక్కడ?

ఆత్మీయ సమ్మేళనాల్లో కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి


ఖమ్మంరూరల్: మాట్లాడుతున్న పొంగులేటి

ఖమ్మంరూరల్/కూసుమంచి: హైదరాబాద్‌లో నివాస ముండి సరిగ్గా ఎన్నికలకు పదిహేను రోజుల ముందు వచ్చి కాంగ్రెస్ పుణ్యమాని 2018లో గెలిచిన స్థానిక ఎమ్మెల్యే ఇప్పుడు స్థానికత గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డిని ఉద్దేశించి పాలేరు కాంగ్రెస్ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం ఖమ్మంరూరల్ మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌లో సయ్యద్ సాధిక్ అలీ ఆధ్వర్యాన, పాలేరులో జిల్లా గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు మేకల మల్లిబాబు యాదవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనాల్లో ఆయన మాట్లాడారు. తాను ఖమ్మం జిల్లా బిడ్డనని, ఇక్కడే పుట్టి పెరిగి రాజకీయాల్లో కొనసాగుతున్నానని చెప్పారు. మైక్ ఇస్తే రెండు నిమిషాలు కూడా మాట్లాడలేని ఎమ్మెల్యేకు పాలేరులో నలుగురు అనుచరులు ఎమ్మెల్యేలుగా చాలమణి అవుతున్నారని, వారి చేసే భూకబ్జాలు, దౌర్జన్యాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో డీడీలు కట్టిన యాదవ, కురుమలకు గొర్రెలు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి తనను ఆశీర్వదించాలని తెలిపారు.

100 కుటుంబాలు చేరిక..

భగవీడ్‌తండాకు చెందిన బీఆర్ఎస్ సర్పంచ్, ఉపసర్పంచ్, ఎంపీటీసీలతో పాటు మరో 100 కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పొంగులేటి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, మద్దినేని స్వర్ణకుమారి, కళ్లెం వెంకటరెడ్డి, వెంపటి వెంకన్న, శేషిరెడ్డి, ప్రతిమాచారి, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్, నాయకులు మిడకంటి చినవెంకటరెడ్డి, చెరుకుపల్లి భాస్కర్, టీపీసీసీ సభ్యుడు నాగ సీతారాములు, పుచ్చకాయల వీరభద్రం, వెనికె జానకిరామయ్య, వెన్నపూసల సీతరాములు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కట్టించింది నా హయాంలోనే..

- కానీ ఇప్పుడు లైసెన్సులకు డబ్బు వసూలు చేశారు
- కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు


కలాం చిత్రపటం వద్ద తుమ్మల, నాయకుల నివాళి

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం ప్రజల అవసరాలను గుర్తించి హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌తో పాటు పత్తి మార్కెట్‌ను సైతం నా హయాంలోనే కట్టించానని ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆయన బైపాస్‌రోడ్డులోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌ను సందర్శించి వ్యాపారులను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఇక్కడ లైసెన్స్ ఇప్పిస్తామని చెప్పి కొందరు రూ.లక్షల్లో వసూలు చేశారని తెలిసిందన్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే డబ్బు తిరిగి ఇప్పించడమే కాక అవకాశం ఉంటే షాపులు సైతం ఇప్పిస్తానని తెలిపారు. పత్తి, మిర్చి మార్కెట్‌లో సైతం లైసెన్స్‌లు అమ్ముకున్నారని విమర్శించారు. కాగా, తనను గెలిపిస్తే బెదిరింపు రాజకీయాలు ఉండవని.. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని తెలిపారు. అలాగే, ఖమ్మంలో హోల్‌సేల్ పండ్ల మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం ఆర్టీవో ఆఫీస్ ప్రక్కన రామాలయంలో పూజలు చేసిన తుమ్మల.. 37, 38వ డివిజన్లలో జరిగిన రోడ్డు షోలో మాట్లాడారు. తాను ఎక్కడైనా చెల్లే డాలర్ వంటి వాడినైతే, బీఆర్ఎస్ అభ్యర్థి రద్దయిన రూ.2వేల నోటు వంటి వాడని ఎద్దేవా చేశారు.

డబుల్‌బెడ్ రూం బాధితుల వినతి..

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తామని రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు దళారులు వసూలు చేశారని పలువురు తుమ్మల దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఈ డబ్బు అడిగితే మంత్రి అనుచరులు బెదిరిస్తున్నారని ఆర్టీఐ కార్యకర్త కోయిని వెంకన్న ఆధ్వర్యాన వారు విన్నవించగా కాంగ్రెస్ అధికారంలోకి రాగానే న్యాయం చేస్తానని తెలిపారు. ఇక మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ కార్యాలయంలో కలాం చిత్రపటానికి తుమ్మల తదితరులు నివాళులర్పించారు.

కాంగ్రెస్‌లో చేరిక..

రఘునాథపాలెం: మండలంలోని రేగులచలకకు చెందిన మాజీ ఉపసర్పంచ్ యండపల్లి సత్యం ఆధ్వర్యాన ఏ.చిన్నభూషయ్య, పి.మధు, శ్రీను, సురేష్, నరేష్, జానీ తదితరులు కాంగ్రెస్‌లో చేరగా తుమ్మల నాగేశ్వరరావు వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈకార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, నాయకులు మానుకొండ రాధాకిషోర్, మహ్మద్ ఆశ్రిఫ్, రబ్బానీ, దొబ్బల సౌజన్య, పుచ్చకాయల వీరభద్రం, సయ్యద్ హుస్సేన్, చోటేబాబా, మలీదు జగన్, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే ఐటీ దాడులు

నేలకొండపల్లి: బీఆర్ఎస్‌కు ఓటమి భయంతోనే పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై ఐటీ దాడులకు పాల్పడుతున్నారని, బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక్కటేనని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేశ్ పేర్కొన్నారు. శనివారం సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ అధ్యక్షతన మండలంలోని కోనాయిగూడెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు, పాలేరులో పొంగులేటి విజయాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ఈ సమావేశంలో మండల పరిశీలకులు పొంగులేటి బాలు, కాంగ్రెస్ నాయకులు పాకనాటి కన్నారెడ్డి, కొమ్మినేని విజయ్‌బాబు, కుమ్మరి నాగమణి, మేకల అర్జున్, వడ్లమూడి శ్రీను, గంపల రారాజు, కుమ్మరి నారాయణ, వుల్లోజి పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవుడి పేరుతో రాజకీయాలు తగదు


నిరసన తెలుపుతున్న మహిళలు, నాయకులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు బీఆర్ఎస్ నాయకుల తీరుకు నిరసన వ్యక్తం చేశారు. శనివారం ఆరో వార్డులో ఉత్సవ కమిటీకి మైక్ సెట్ వితరణ అందిస్తామని చెప్పి కొంతమంది స్వార్థంతో రాజకీయ సమావేశంగా మార్చి బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటించాలని ప్రచారం చేయడం పద్ధతి కాదన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం దేవుడు పేరును వాడుకోవద్దన్నారు. భక్తులతో పాటు, కాంగ్రెస్ నాయకులు మైశా శంకర్, జెర్రిపోతుల సత్యనారాయణ, పొన్నగాని రాంభాస్కర్, పి.బ్రహ్మం, రాంబాబు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

ఖమ్మంఓన్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే మైనార్టీల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని ఖమ్మం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహ్మద్ జావీద్ అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో ఉన్న 3శాతం రిజర్వేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే 12 శాతానికి పెంచుతామని చెప్పారు. మైనార్టీ డిక్లరేషన్‌లో పొందుపర్చిన ప్రతీ అంశాన్ని తప్పకుండా అమలు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గ మీడియా ఇన్‌చార్జ్ బీఆర్ అనిల్‌కుమార్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, బీహెచ్ రబ్బానీ, చోటేబాబా, ఆశ్రిఫ్, గౌస్, అబ్బాస్, ముక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

నమ్మి పదవిస్తే.. నట్టేటముంచావు..

మంత్రి, ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్


రఘునాథపాలెం: గణేశ్వరం ప్రచారంలో పువ్వాడ అజయ్‌కుమార్

రఘునాథపాలెం/ఖమ్మంఅర్బన్/ఖమ్మంమయూరి సెంటర్: ప్రజలకు మెరుగైన సంక్షేమ పథకాలు అందించాలని సీఎం కేసీఆర్ మంత్రి పదవి ఇస్తే ప్రజలకు చేసిందేమి లేదని, పాలేరులో చెల్లని రూపాయి మళ్లీ ఖమ్మం వచ్చిందని తుమ్మల నాగేశ్వరరావును ఉద్దేశించి బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని 6వ డివిజన్ ప్రశాంతినగరలో కార్పొరేటర్ నాగండ్లకోటి ఆధ్వర్యాన, 20, 21వ డివిజన్‌లలో కార్పొరేటర్లు ప్రశాంతలక్ష్మి, ఆళ్ళ నిరిషాల ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనాల్లో ఆయన మాట్లాడారు. మంత్రి పదవిని అడ్డు పెట్టుకొని కూసుమంచి నుంచి దమ్మపేట అవతల వరకు 300 ఎకరాల పామాయిల్ తోటలు కొనుక్కుని స్థిరపడి ప్రజలను నట్టేటముంచావని ఎద్దేవా చేశారు. తనకిచ్చిన మంత్రి పదవికి వందశాతం న్యాయం చేశానని, ఇప్పుడు జరుగుతున్న ఎన్నికలు అభివృద్ధికి.. అభివృద్ధి నిరోధకులకు జరుగుతున్న ఎన్నికలన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే కాలిపోయిన మోటార్లు..రైతు ఆత్మహత్యలు, ఎరువుల కోసం లాఠీ దెబ్బలు గుర్తొస్తాయని రఘునాథపాలెం మండలం గణేశ్వరం గ్రామంలో నిర్వహించిన రోడ్ షోలో పువ్వాడ మాట్లాడారు. దౌర్భాగ్యం ఏంటంటే తాను మంత్రి అయిన తరువాత ఖమ్మాన్ని అభివృద్ధి చేస్తే... అంత తానే చేశానని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కాగా, ఖమ్మం నగరం జనసేన విద్యార్థి విభాగానికి చెందిన యువకులు శనివారం డాక్టర్ పువ్వాడ నయన్‌రాజ్, చంద్ర శేఖర్ ఆధ్వర్యాన జనసేన విద్యార్థి విభాగం నాయకుడు తుమ్మలపూడి గంగాధర్‌లతో పాటు 30 మంది యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఇదిలా ఉండగా.. నగరంలోని 8వ డివిజన్‌లో పువ్వాడ విజయాన్ని కాంక్షిస్తూ నగర ఎస్టీ సెల్ అధ్యక్షుడు వాంకుడోత్ సురేశ్ ఆధ్వర్యాన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, వర్తక సంఘం అధ్యక్షుడు చిన్ని కృష్ణారావు, జెడ్పీటీసీ మాలోత్ ప్రియాంక, టౌన్ ప్రెసిడెంట్ పగడాల నాగరాజు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖమర్, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, మక్బూల్, నాయకులు యసా రామారావు వీరునాయక్, కుర్రా భాస్కర్ రావు, మహంకాళి లక్ష్మీనారాయణ, గుండెటి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటు అడిగే హక్కు నాకే ఉంది..

ఎమ్మెల్యే, పాలేరు బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి


లాల్‌సింగ్‌తండాలో మాట్లాడుతున్న కందాళ ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి/నేలకొండపల్లి/ఖమ్మంరూరల్: ఎన్నికలప్పుడే కనిపించి, మాయ మాటలు చెప్పి ఓట్లు అడిగే వారిని నమ్మొద్దని పాలేరు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఆయన తన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను గత ఐదేళ్లుగా నియోజకవర్గ ప్రజల్లో ఉంటూ వారికి అండగా నిలిచానని, రాజకీయాలకు అతీతంగా తాను అందించిన సేవలకు తనకే ఓటు అడిగే హక్కు ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వ పథకాలు కొనసాగాలంటే రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను, పాలేరును తనను మరో మారు గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే కందాళకు ఘన స్వాగతం పలుకగా.. పలువురు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. కాగా, కందాళ ఉపేందర్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మంరూరల్ మండలం పెదతండా పరిధిలోని వెంకటగిరి, ఇందిరమ్మ కాలనీలో ఆయన సతీమణి విజయమ్మ, కుమార్తె దీప్తిలు, నేలకొండపల్లి మండలం చెరువుమాధారంలో ఎమ్మెల్యే కుమార్తె దీపిక ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్, జెడ్పీటీసీ ఇంటూరి బేబీ, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థులకు రక్షణ కల్పించాలి

తిరుమలాయపాలెం: పాలేరు నియోజకవర్గంలో పోటీ చేస్తున్న స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థులకు ఎలక్షన్ కమిషన్ రక్షణ కల్పించాలని స్వతంత్ర అభ్యర్థులు డిమాండ్ చేశారు. శనివారం తిరుమలాయపాలెంలో ఏర్పాడు చేసిన మీడియా సమావేశంలో స్వతంత్ర అభ్యర్థులు ఇస్లావత్ రాజేందర్, గుగులోత్ సురేష్ నాయక్, వాంకుడోత్ తిరుపతి నాయక్, ఇస్లావత్ ఠాగూర్ నాయక్, బహుజన ముక్తి పార్టీ అభ్యర్థి మట్టి ప్రసాద్ మాట్లాడారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఇస్లావత్ తండా గ్రామానికి చెందిన స్వతంత్ర అభ్యర్థి ఇస్లావత్ రాజేందర్‌పై కొందరు భౌతిక దాడి చేయడాన్ని ఖండించి, దాడి చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎలక్షన్ కమిషన్‌ను కోరారు.

ముమ్మరంగా ప్రచారం చేపట్టాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం నియోజకవర్గంలో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం చేపట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. బీజేపీని బలపరచిన జనసేన అభ్యర్థి రామకృష్ణతో కలిసి శనివారం జిల్లా కార్యాలయంలో ఎన్నికల ప్రచారంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. అనంతరం గల్లాకు జనసేన అభ్యర్థి రామకృష్ణ ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జ్ త్రిలోక్, రాష్ట్ర నాయకుడు గెంటెల విద్యాసాగర్, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, అంకిత పాపారావు, శ్రీనివాస్, జనసేన నాయకులు కార్తీక్, అజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎన్నికల ప్రచారం

ఖమ్మం రాపర్తినగర్: రానున్న ఎన్నికల్లో బీజేపీ మద్దతుతో ఖమ్మం జనసేన పార్టీ తరపున పోటీ చేస్తున్న మిరియాల రామకృష్ణను గెలిపించాలని కోరుతూ బుధవారం నగరంలోని 26, 27, 37వ డివిజన్లలో బీజేపీ నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. గాజు గ్లాసు గుర్తుపై ఓట్లు వేసి జనసేన అభ్యర్థిని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధికార ప్రతినిధి మారుతి వీరభద్రప్రసాద్, నగర అధ్యక్షుడు పిల్లల మర్రి వెంకటనారాయణ, ఊరుకొండ ఖాదర్, బెండడి నరేశ్, శ్రీనివాస్, పాలెపు రాము, ఆకుల మురళి, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంను గెలిపించాలి

ఖమ్మంమయూరిసెంటర్: నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే సీపీఎం అభ్యర్థి యర్రా శ్రీకాంత్ విజయానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో యర్రా శ్రీకాంత్ విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన సమావేశం ఆయన మాట్లాడారు. ఖమ్మంలో రెండు కార్పొరేట్ శక్తులు ఎన్నికలలో డబ్బుతో గెలవాలని చూస్తున్నాయని, వారు ప్రజా సమస్యలపై ఎప్పుడైనా పోరాడారా? అన్ని తెలిపి సీపీఎంను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, నాయకులు శ్రీనివాసరావు, ఎం.ఎ.జబ్బార్, ఎస్.నవీన్‌రెడ్డి, షేక్ మీరా, బి.సుదర్శన్, భూక్యా శ్రీను, పాల్గొన్నారు.

మోసపూరిత హామీలను నమ్మొద్దు..

తిరుమలాయపాలెం: ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేసే పార్టీలను నమ్మొద్దని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు కమ్మకోమటి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మతోన్మాదం, ఫాసిస్టు విధానాలను అమలు చేస్తున్న బీజేపీని, రాష్ట్రంలోని బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలను ఓడించాలని తెలిపారు. బలవంతపు చేరికలు తగదని, ప్రజా సమస్యలపై పోరాడే ప్రజాపంథా పార్టీకి ప్రతి ఒక్కరూ మద్దతు తెలిపాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకుడు ఎడ్లపల్లి నవీన్, బానోత్ శంకర్, నామా అప్పారావు, తాళ్లపల్లి నర్సయ్య, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ మాయలో పడొద్దు..

ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి హరిప్రియానాయక్


కామేపల్లిలో మాట్లాడుతున్న హరిప్రియానాయక్

కామేపల్లి: బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు చెప్పే మాయమాటలు విని మోసపోవద్దని, అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్నే ఆదరించి ఆశీర్వదించాలని ఇల్లెందు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ హరిప్రియానాయక్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని జోగ్గూడెం, ఊట్కూర్, కామేపల్లి, రామకృష్ణాపురం గ్రామాల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారం నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేశానని, మరోసారి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పెట్టిన పథకాలన్నీ అమలు కావాలంటే కారు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాగా, కామేపల్లిలో వివిధ పార్టీలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో హరిప్రియానాయక్ సమక్షంలో చేరారు. మండలాధ్యక్షుడు ధనియాకుల హన్మంతరావు, వైస్ ఎంపీపీ అజ్మీర విజయలక్ష్మి, సర్పంచ్ జర్పుల భగవాన్, నాయకులు ఆంతోటి అచ్చయ్య, జర్పుల రామోజీనాయక్, భట్టు శంకర్, కొనకంచి శంకర్, ఏపూరి పాపారావు, అజ్మీర రాజునాయక్, రాందాస్‌నాయక్ పాల్గొన్నారు.